క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన వరికూటి అశోక్‌బాబు



వేమూరు: గుంటూరు, కృష్ణా జిల్లాల పార్టీ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని, నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లి పార్టీ కార్యాలయంలో ఆదివారం వైవీ సుబ్బారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా వరికూటి మాట్లాడుతూ పార్టీ అధికార ప్రతినిధిగా తన నియామకానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నిరంతరం పార్టీ కోసం పని చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేసిన డీఎస్పీ



వేమూరు: పోలీసు స్టేషన్‌లో రికార్డులు సక్రమంగా ఉండాలని రేపల్లె డీఎస్పీ ఏ శ్రీనివాసరావు తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదివారం వేమూరు పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ పి.రామంజనేయులు, ఎస్‌ఐ రవికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సమస్యల పరిష్కార వేదిక

రేపల్లె రూరల్: రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆర్డీవో నేలపు రామలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో చెప్పారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

దుప్పట్లు పంపిణీ



పెదగొల్లపాలెం(కర్లపాలెం): మనకు ఉన్నంతలో పేదలకు సేవలందించటం వలన ఆత్మ సంతృప్తి కలుగుతుందని కరుణా జీవన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇనకొల్లు పోలీస్‌రావు అన్నారు. పెదగొల్లపాలెం పంచాయతీ గాదె వెంకటరెడ్డి కాలనీలో 10 మంది గిరిజనులకు ఆదివారం కరుణా జీవన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పోలీస్‌రావు దుప్పట్లు పంపిణీ చేశారు. అందరూ తమ పిల్లల్ని చక్కగా చదివించుకోవాలని గిరిజనులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీస్ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఐ.నరేంద్ర, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

సరళమైన భాష, యాసల కవితలు వేమన సొంతం



బాపట్ల: సరళమైన భాష, యాసల కవితలు యోగి వేమన సొంతమని రచయిత జి.శాంతారామ్ పేర్కొన్నారు. యోగి వేమన జయంతి సందర్భంగా వివేకానంద కాలనీలో బాలినేని మాధవి చౌదరి కల్యాణ మండపంలో ఆదివారం యోగివేమన చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిగా రచయిత జి.శాంతారామ్ మాట్లాడుతూ వేమన కవితలు సరళమైన భాష, యాసలను కలిగి ఉంటాయన్నారు. అందువలన వారి కవితలు ప్రసిద్ధి గాంచాయన్నారు. కార్యక్రమంలో వివేకానంద కాలనీ అధ్యక్షుడు ప్రసాద్, సభాధ్యక్షుడు గోపీచంద్, కార్యదర్శి శ్రీధర్, ధృతి కన్వీనర్ చావల సుబ్రహ్మణ్యం, అల్లాడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్ట్

తెనాలిరూరల్: కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని కఠెవరం సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్‌ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ తమ సిబ్బందితో ఆదివారం మధ్యాహ్నం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఒక కోడి, రూ.1500 స్వాధీనం చేసుకున్నారు.

చెరువులు సిద్ధం.. సాగు ప్రశ్నార్థకం..!?

ఆక్వా సాగుపై అనుమానాలు
- సాగు చేసేందుకు జంకుతున్న రైతులు
- భారీగా పెరిగిన ఉప్పు శాతం

బాపట్ల: గతేడాది ఖరీఫ్, రబీలకు వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది కూడా అదే పరిస్థితి కొనసాగుతుందేమోనని ఆక్వా రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వర్షభావ పరిస్థితి వస్తే గతేడాదిలాగే ఈ ఏడాది కూడా నష్టాలను చవిచూడాల్సి వస్తుందని చెరువులను సైతం బాగు చేసుకుని సాగు ప్రారంభించాలా... వద్దా అన్న సందేహంలో ఉన్నారు. ఆక్వాసాగు, రైతులు, ఉద్యానవన పంటలకు సంబంధించిన రైతులు తమ పొలాలను ఖాళీగా పెట్టుకుని ఉన్నారు. ప్రతి ఏడాది డిసెంబర్ నెలలో చెరువులను సిద్ధం చేసుకొని జనవరి చివరి వారం నుంచి రొయ్యల చెరువుల సాగుకు శ్రీకారం చుట్టేవారు. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి సాగునీరు డ్రెయిన్లకు విడుదల కాకపోవడంతో సముద్రంలో ఉన్న నీరు పోటు సమయంలో కాలువల్లోకి భారీగా చేరడంతో కాలువ నీటిలో ఉప్పు శాతం విపరీతంగా పెరిగింది. సాధారణంగా ఫిబ్రవరి, మార్చి నెలల్లో రొయ్యల సాగుకు అనుకూలమైన పేరలి డ్రెయిన్, వెదుళ్ళపల్లి డ్రెయిన్‌లో ఉప్పు 15 శాతం మేర ఉండేది. ఈ ఏడాది అది కాస్తా 30 శాతానికి పెరిగింది. ఇంత ఉప్పు శాతంలో రొయ్యల సాగుకు శ్రీకారం చుడితే రొయ్యలు పెరుగుదల నిలిచిపోయే ప్రమాదం ఉంటుంది. దీంతో రొయ్యల సాగు చేసే రైతులు సాగుచేయాలంటే జంకుతున్నారు.

10 వేల 15 వేల ఎకరాల్లో సాగు

ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది కూడా ఆక్వా రైతులు జనవరి నెలలో బయట వ్యాపారస్తుల వద్ద వడ్డీలకు నగదు తీసుకొచ్చి చెరువులను సాగుకు సిద్ధం చేసుకున్నారు. ఒక ఎకరం చెరువును సిద్ధం చేయటానికి ట్రాక్టర్ సహాయంతో నాలుగు సార్లు దుక్కి దున్నినందుకు రూ.3 వేలు, చెరువు లెవలింగ్ చేసినందుకు ట్రాక్టర్‌కు రూ.5 వేలు, జేసీబీ సహాయంతో కట్టలు ఎగపోసినందుకు గంటకు రూ.1000 చొప్పున చెరువు పూర్తిగా శుభ్రం చేసేందుకు సుమారు 4 గంటల మేర సమయం పడుతుంది. దీనికి రూ.4000, రొయ్యల చెరువులో భూమి నుంచి అంటు వ్యాధులు ప్రబలకుండా భూమిలోనే జిప్సమ్ వాడతారు. అదే విధంగా రొయ్యలకు పోషకాలను సమృద్ధిగా అందించేందుకు అవసరమైన వర్మీ కంపోస్ట్, చెరువులకు సాగు నీటిని అందించేందుకు అవసరమైన కాలువలు, రొయ్యలకు గాలిని అందించే ఎయిర్ రేటర్స్ మరమ్మతులు, కల్వర్ట్ మరమ్మతులు చేసేందుకు సగటున ఒక ఎకరం చెరువుకు రూ.50 వేల మేర ఖర్చు చేశారు. ఈ లెక్కన మొత్తం కోస్తా తీర ప్రాంతం చూస్తే సుమారు పది వేల నుంచి 15 వేల ఎకరాల వరకు సాగు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది కాలువల్లో ఉప్పు శాతం ఎక్కువగా ఉండటంతో సాగు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని ఆక్వా రైతులు వాపోతున్నారు.



సాగుకు సిద్ధం చేసిన రొయ్యల చెరువులు



సాగు చేపట్టకపోవడంతో చెరువు కట్టలపై ఉన్న ఎయిర్‌రేటర్స్

అమిత్ షా పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయాలి

సీపీఐ ఏరియా కార్యదర్శి బాలాజీ



అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీపీఐ, సీపీఐ (ఎంఎల్) నాయకులు

రేపల్లె రూరల్: పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ అన్నారు. అమిత్ షాపై చర్యలు తీసుకోవాలని సీపీఐ, సీపీఐ (ఎంఎల్)ల సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని పేటేరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన నిరసన ప్రదర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పదవి ప్రమాణ స్వీకారం అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగంపై చేసిన విషయం గుర్తు లేదా అని ప్రశ్నించారు. అమిత్ షా అవహేళనగా మాట్లాడటం విచారకరమని, పలువురి మనోభావాలు దెబ్బ తీసే విధంగా ఉన్నాయన్నారు. కేంద్రం ప్రభుత్వం వెంటనే అమిత్ షా పార్లమెంటు సభ్యత్వం రద్దు చేయాలన్నారు. ప్రపంచ దేశాలు అంబేడ్కర్‌ను కొనియాడుతుంటే మన దేశంలో మాత్రం బీజేపీ ప్రభుత్వం అంబేడ్కర్‌ను అవమాన పరుస్తూ అవహేళన చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మత విద్వేషాలను రెచ్చగొడుతూ కులాల మధ్య చిచ్చుపెడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఆరోపించారు. అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) నాయకులు మట్రివాడ వెంకట్రావు, దొంతు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, చందోలు ప్రసాద్, బేతపూడి ఏసుపాదం, సీపీఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ నాయకులు వి.శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

సీఐ మల్లికార్జునరావు



రేపల్లె రూరల్: వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని పట్టణ సీఐ మల్లికార్జునరావు చెప్పారు. పట్టణ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే సహించేది లేదని, వీరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు. ప్రయాణాల సమయంలో విధిగా లైసెన్స్‌లు, వాహనాలకు సంబంధించిన కాగితాలను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. అదే విధంగా హెల్మెట్‌లు ధరించి ప్రయాణాలు చేయాలని చెప్పారు. ప్రధాన రహదారుల్లోని దుకాణాల ముందు వాహనాలు నిలుపుదల చేయరాదని వాటి వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. నిత్యావసర వస్తువులు, ఇతర సామగ్రి తీసుకువచ్చే లారీలు, ఇతర పెద్ద వాహనాలు ఆయా దుకాణాల ముందు ఉంచి వస్తువులను దింపటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. ఆయా వాహనాలను జన సంచారం లేని ప్రాంతాలలో నిలుపుదల చేసుకుని వస్తువులను దుకాణాలకు చేరవేసుకోవాలన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



రేపల్లె రూరల్: ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగంతో వాతావరణ కాలుష్యం పెరిగిపోతుందన్నారు. ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు భూమిలో కలిసేందుకు చాలా సమయం పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల స్థానంలో ప్రత్యామ్నాయ గన్నీ బ్యాగ్‌లు, గుడ్డ సంచులు వినియోగించాలన్నారు. ప్లాస్టిక్ విక్రయాలకు పాల్పడినా, వినియోగించినా జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. అదే విధంగా స్వచ్ఛ రేపల్లె సాధనకు ప్రారంభించిన స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛతా దివస్ కార్యక్రమంలో పట్టణ ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ఇళ్ల నుంచి వ్యర్థాలను తడి – పొడి చెత్తలుగా వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలన్నారు. రోడ్లపై గానీ, కాల్వల్లో గానీ చెత్తను వేయకూడదని సూచించారు.

వైద్య రంగంలో ల్యాబ్ అండ్ ఎక్స్‌రే ఉద్యోగుల పాత్ర కీలకం

అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సురేష్



అసోసియేషన్ బైలాను ఆవిష్కరిస్తున్న ల్యాబ్ అండ్ ఎక్స్‌రే అసోసియేషన్ నాయకులు

బాపట్ల: వైద్య రంగంలో ల్యాబ్ అండ్ ఎక్స్‌రే ఉద్యోగుల పాత్ర చాలా కీలకంగా ఉంటుందని బాపట్ల జిల్లా ల్యాబ్ అండ్ ఎక్స్‌రే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.సురేష్ పేర్కొన్నారు. అసోసియేషన్ సమావేశం ఆదివారం స్థానిక ఎమ్మెస్సార్ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సురేష్ మాట్లాడుతూ వైద్యులకు అనునిత్యం అందుబాటులో ఉండి పరీక్షలతో రోగులకు సకాలంలో సాయం అందించేందుకు అనునిత్యం సభ్యులు కృషి చేయాలని సూచించారు. అసోసియేషన్ సభ్యులకు రూ.పది లక్షల జీవిత బీమాను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అసోసియేషన్ బైలాను అనుసరించి పలు కార్యక్రమాలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్ కిరణ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

బాపట్ల ఫొటోగ్రాఫర్‌కు బెస్ట్ ఇమేజ్ అవార్డు



బాపట్ల: బాపట్ల ఫొటోగ్రాఫర్ పి.వి.ఎస్.నాగరాజుకు బెస్ట్ ఇమేజ్ అవార్డు లభించింది. అమరావతి అభివృద్ధి అన్న అంశంపై ఫొటోగ్రఫీ పోటీలను అమరావతి ఫెస్టివల్ సొసైటీ నిర్వహించిన పోటీల్లో బాపట్లకు చెందిన పి.వి.ఎస్.నాగారాజు తీసిన ఫొటోకు బెస్ట్ ఇమేజ్ అవార్డు దక్కింది. అన్నా క్యాంటిన్‌లో భోజనం చేస్తున్న ప్రజలను ఫొటో తీసి పంపగా బెస్ట్ ఇమేజ్ అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డును విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో శనివారం అందించారు. అమరావతి ఫెస్టివల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.పట్టాభిరామయ్య, ఫొటో కంటెస్ట్ చైర్మన్ డాక్టర్ జి.సురేంద్ర చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

లక్కిపోగు వందనకుమార్



బాపట్ల: పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్కిపోగు వందనకుమార్ పేర్కొన్నారు. బీఎస్పీ ముఖ్య నాయకుల సమావేశం స్థానిక అంబేడ్కర్ భవనంలో ఆదివారం జరిగింది. రాష్ట్ర అధికార ప్రతినిధి లక్కిపోగు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి జరగాలని కోరారు. కమిటీల ఏర్పాటు కూడా వేగవంతం చేయాలని సూచించారు. కులగణనను పరిశీలించాలని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు ఉప్పాల మురళిగౌడ్, జిల్లా ఇన్‌చార్జి కోటేశ్వరరావు, నాయకులు రాజారావు, సంపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రాసనకు వచ్చి అనంత లోకాలకు



మృతి చెందిన వెంకట ప్రసాద్

కర్లపాలెం: కుమారునికి అన్నప్రాసన చేసేందుకు సంతోషంగా ఏర్పాట్లు చేసుకుంటున్న ఓ తండ్రిని మృత్యువు ట్రాక్టర్ రూపంలో వచ్చి ఢీ కొనటంతో అతను మృతి చెందాడు. ఈ ఘటనతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. చందోలు ఎస్‌ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు కొండవీటి వెంకట ప్రసాద్ (34) ఉద్యోగ రీత్యా వైజాగ్‌లో ఉంటున్నాడు. తన కుమారునికి అన్నప్రాసన చేసేందుకు కుటుంబ సభ్యులంతా ఆదివారం ఉదయం భవనంవారిపాలెం వచ్చారు. ఈ నేపథ్యంలో చందోలు బగళాముఖి అమ్మవారి ఆలయంలో అన్నప్రాసన ఏర్పాట్లు చూసేందుకు తన తమ్ముడు గోపీని ఆలయం వద్ద దించి కుటుంబ సభ్యులను తీసుకువెళ్లేందుకు చందోలు నుంచి టీవీఎస్ ఎక్సెల్ బైక్‌పై భవనంవారిపాలెం వస్తుండగా భవనంవారిపాలెం సమీపంలో వెనక నుంచి ట్రాక్టర్ ఢీ కొనటంతో వెంకటప్రసాద్ రోడ్డుపై పడ్డాడు. ట్రాక్టర్ ట్రక్కు చక్రం అతని తలపైకి ఎక్కటంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య హారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడు వెంకట ప్రసాద్‌కు భార్య హారిక, కుమార్తె లహరి, కుమారుడు నిత్విక్ కార్తీకేయ ఉన్నారు. కుమారునికి అన్నప్రాసన చేసేందుకు వచ్చిన వెంకట ప్రసాద్ ప్రమాదంలో మృతి చెందటంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

పోస్టల్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన డీఎస్ఎన్

సంస్మరణ సభలో ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్ సి.కాశీం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

తెనాలి: గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల హక్కుల సాధనకు ఢిల్లీ వరకు ఉద్యమాన్ని నడిపి వారి జీవితాల్లో వెలుగులు నింపిన పోస్టల్ ఉద్యమనేత దేవిరెడ్డి శివనాగేశ్వరరావు (డీఎస్ఎన్) ఆరంభించిన ప్రయాణాన్ని పరిపూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సి.కాశీం అన్నారు. గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా అందరినీ సమీకరించి ఐక్యవేదిక ద్వారా అద్భుతమైన విజయాలను సాధించిన ఉద్యమనేత డీఎస్ఎన్ సంస్మరణ సభను ఆదివారం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఎం.తిరుమలరావు అధ్యక్షతన జరిగింది. ప్రొఫెసర్ కాశీం తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, నేడు దేశంలో పెట్టుబడిదారుల ప్రగతే దేశ అభివృద్ధి నమూనాగా మారిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు బాటన పట్టిస్తున్నారని విమర్శించారు. దేశాన్ని టోకున విదేశీ కంపెనీలకు తాకట్టు పెట్టే అభివృద్ధి నమూనా జరుగుతోందని చెప్పారు. డీఎస్ఎన్ బాటలోనే ఐక్యంగా ఉద్యమించి హక్కులను కాపాడుకోవాలని సూచించారు. తెలంగాణ విద్యావంతుల ఐక్యవేదిక నాయకుడు అంబటి నాగన్న మాట్లాడుతూ మనిషితత్వాన్ని పరిమళించిన డీఎస్ఎన్, మనిషేవాడుఎలాంటి జీవితాన్ని గడపాలనే సిలబస్ ఇచ్చాడని చెప్పారు. పీబీవీ గణేష్ మాట్లాడుతూ ఉద్యమనేతగా సాధారణ పోస్టల్ ఉద్యోగుల హక్కులకోసం కృషిచేసిన డీఎస్ఎన్, వారికోసం సహకార సొసైటీని స్థాపించి 20 ఏళ్లుగా అభివృద్ధి చేయటం గొప్ప విషయమన్నారు. నాలుగువేల మంది సభ్యులతో రూ.పదుల కోట్ల డిపాజిట్లతో నడుస్తున్న సొసైటీలో ఎలాంటి అవినీతి లేకపోవటం డీఎస్ఎన్ కార్యదక్షతకు నిదర్శనమన్నారు. హక్కుల పోరాటంతోపాటు మానవీయ విలువలను ఆయన మనకు అందించారని చెప్పారు. అఖిల భారత గ్రామీణ పోస్టల్ ఉద్యోగుల సంఘం నాయకుడు బి.వెంకటేశ్వర్లు తన ప్రసంగంలో డీఎస్ఎన్ స్ఫూర్తితోనే తెలంగాణలో గ్రామీణ తపాల ఉద్యోగుల సహకార సొసైటీని స్థాపించానని, అందుకాయన ఎంతగానో సహకరించారని చెప్పారు. సభలో పోస్టల్ ఉద్యోగుల ఏపీ సర్కిల్ కార్యదర్శి పి.ఎస్.డేవిడ్‌రాజు, ఎన్‌యూపీఈ, పీఎంఅండ్ఎంటీఎస్, ఏపీ సర్కిల్ కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ, ఎన్‌యూడీఎస్, ఏపీ సర్కిల్ కార్యదర్శి ఎస్.యోగీశ్వరరావు, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్రనేత కె.కృష్ణ, నండూరి నారాయణ, శివకృష్ణ, జనసాహితి నేత చందు నాగేశ్వరరావు, విశ్రాంత వైద్య ప్రొఫెసర్ విజయకుమార్ తదితరులు మాట్లాడారు. ప్రజాకళామండలి కోటి బృందం విప్లవగీతాలను ఆలపించింది.

నడక ప్రాధాన్యతపై ఉద్యమస్థాయి ప్రచారం

- ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్–203 గవర్నర్ పెద్ది శివరామప్రసాద్
- ఘనంగా వాకర్స్‌క్లబ్ రజతోత్సవం



సత్కారగ్రహీతలతో అతిథులు

తెనాలి: వేగం పెరిగిన నేటి జీవనవిధానంలో ఎక్కువమంది జీవనశైలి వ్యాధులకు గురవుతున్నారనీ, ప్రతిరోజూ కొద్దిసేపు నడకతో ఆరోగ్యంగా జీవించవచ్చని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్–203 గవర్నర్ పెద్ది శివరామప్రసాద్ అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నడక ప్రాధాన్యతపై ఉద్యమస్థాయిలో ప్రచారం జరగాలని ఆయన సూచించారు. ఇందుకు వాకర్స్ క్లబ్‌లపై గురుతర బాధ్యత ఉందన్నారు. వాకర్స్ క్లబ్, తెనాలి 25వ వార్షికోత్సవం ఆదివారం ఉదయం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవనలో ఘనంగా నిర్వహించారు. క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పెద్ది శివరామప్రసాద్ తన ప్రసంగంలో వాకర్స్ ఇంటర్నేషనల్‌లో ఉన్న డిస్ట్రిక్ట్ గవర్నర్ విధులను, మహాత్మాగాంధీ ఫెలో (ఎంజీఎఫ్) గురించి వివరించారు. విశిష్ట అతిథి చెలికాని సీతారామయ్య మాట్లాడుతూ 2017లో తాను వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌గా ఉన్నపుడు 200 కొత్త క్లబ్‌ల ఏర్పాటుకు చూపిన చొరవను తెలియజేశారు. క్లబ్‌ల నుంచి విరాళాల రూపంలో వసూలుచేసిన నిధులతో విశాఖపట్టణంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థకు సొంత భవనం ఏర్పాటుచేయగలిగినట్టు తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్‌కు రూ.6 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని చెబుతూ వాటిపై వచ్చే వడ్డీని మాత్రమే సామాజిక సేవకు, క్లబ్ కార్యకలాపాలకు వినియోగిస్తామని తెలిపారు. డిస్ట్రిక్ట్ ట్రెజరల్ లఘువరపు సత్యనారాయణ మాట్లాడారు. క్లబ్ తరపున ఉత్తమ వాకర్‌గా మెడతాటి బాపూజీ, మహిళా వాకర్‌గా ఎస్.ధనలక్ష్మి, ఉత్తమ యోగసాధకులు తుమ్మలపల్లి ఉషారాణి, స్వచ్ఛంద సంస్థ హెలిపింగ్ సోల్జర్ అధ్యక్షుడు షేక్ ఇనయతుల్లాను సత్కరించారు. క్లబ్ కార్యదర్శి కడియాల రవిబాబు నివేదికను సమర్పించారు. క్లబ్ సభ్యులు త్రిపురనేని రత్తయ్య, అశోక్‌కుమార్, నారాయణ, రంగారావు, నరేంద్ర, సంకా ఉదయశంకర్, మొవ్వా సత్యనారాయణ, ఇతర క్లబ్‌ల సభ్యులు జీవీ నారాయణ, అశోక్, అర్జునరావు, డాక్టర్ జేఎస్‌సీ బాబు తదితరులు పాల్గొన్నారు.

మాధవరావు మృతి సమాజానికి తీరనిలోటు

సంస్మరణ సభలో మానవ హక్కుల వేదిక రాష్ట్రనేతలు



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్

తెనాలి: అణచివేత చట్టాల మూలాలు ఎక్కడున్నాయి...ఎలా విస్తరిస్తున్నాయనే అంశాలపై అవగాహనతో ప్రజలను చైతన్యవంతులను చేస్తున్న హక్కుల ఉద్యమనేత, న్యాయవాది గొర్రెపాటి మాధవరావు ఆకస్మిక మృతి సమాజానికి తీరనిలోటని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్ అన్నారు. మానవ హక్కుల వేదిక తెలంగాణ పూర్వ అధ్యక్షుడు, పాత్రికేయుడు, న్యాయవాది గొర్రెపాటి మాధవరావు సంస్మరణను ఆదివారం రాత్రి తెనాలిలో ఏర్పాటు చేశారు. మానవ హక్కుల వేదిక, గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నందులపేటలోని కవిరాజ పార్కులో గల వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభకు వేదిక కృష్ణాజిల్లా కన్వీనర్ జి.రోహిత్ అధ్యక్షత వహించారు. రాజేష్ మాట్లాడుతూ విద్యార్థిగా ఉన్నపుడే రాజకీయాల్లో చురుకుగా వుంటూ వచ్చిన మాధవరావు సమాజంలో పెరుగుతున్న విద్వేష రాజకీయాలపై అవగాహన కలిగిన వ్యక్తిగా చెప్పారు. తోటి పౌరులకు న్యాయసహాయం అందిస్తూనే అణచివేత చట్టాలు, విద్వేష రాజకీయాలపై ప్రజాచైతన్యానికి వృత్తిపరంగా, వేదిక పరంగా, రచనా పరంగా విశేషమైన కృషిచేశారని చెప్పారు. ఆరకమైన కృషి మరింతగా జరగాల్సిన సమయంలో ఆయన హఠాన్మరణం విషాదమన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జగన్నాధరావు తన ప్రసంగంలో పౌరహక్కుల సంఘంలో డాక్టర్ బాలగోపాల్‌తో కలిసి తాను, మాధవరావు కలిసి పనిచేశామని గుర్తుచేసుకున్నారు. హక్కుల వేదిక వ్యవస్థాపకుల్లో ఇద్దరమూ ఉన్నట్టు తెలిపారు. మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ మాట్లాడుతూ మాధవరావు బూటకపు ఎన్‌కౌంటర్లలో బాధిత కుటుంబాలకు పరిహారం ఇప్పించేందుకు కోర్టుల ద్వారా తన వంతు కృషిచేశారని వివరించారు. న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు, జుగాష్‌విలి, నండూరి నారాయణ, కులనిర్మూలన పోరాటసమితి రాష్ట్ర నాయకుడు కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతుల ధర్నాను జయప్రదం చేయండి

రైతు సంఘం నాయకుడు శివసాంబిరెడ్డి

కొల్లిపర: తెనాలిలో నేడు జరిగే అగ్నిబాధిత పసుపు రైతుల ధర్నాలో రైతులు వేల సంఖ్యల్లో పాల్గొని జయప్రదం చేయాలని రైతుసంఘం నాయకుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. మండలంలోని మున్నంగి, వల్లభాపురం, కొల్లిపరలో ఆదివారం రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుగ్గిరాల శుభమ్ మహేశ్వరీ కోల్డ్‌స్టోరేజీలో పసుపు కాలిపోయి నేటికి సంవత్సరం అయిందని, అయినా గానీ ఇన్స్యూరెన్స్ అధికారులు క్లెయిమ్‌లు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. పసుపు రైతులకు మండలంలోని అందరు రైతులు అండగా ఉండి తెనాలిలో జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కొమ్మారెడ్డి రంగారెడ్డి, బొంతు వెంకటరెడ్డి, అచ్యుత సురేష్, వంగా కోటిరెడ్డి, కొండా లక్ష్మారెడ్డి, లంకిరెడ్డి పిచ్చిరెడ్డి, ఆరిగ బోసురెడ్డి, రవితేజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైల్వే గేటు మూత

తెనాలిరూరల్: తెనాలి మారిస్‌పేటలోని రేపల్లె గేటు ఎదురు ఉన్న మద్రాసు గేటును మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో రైల్వే లైను పనుల కోసం సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకు గేటును మూసి వస్తున్నామని, ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకుని సహకరించాలని కోరారు.